

పత్తి రైతుకు కష్టకాలం



దిగుబడి రాక.. ధర లేక అవస్థలు

- ఎకరాకు నాలుగు క్వింటాళ్ల దిగుబడి
- క్వింటా రూ.ఆరు వేలే
- నష్టాలు తప్పవంటున్న రైతులు

యాడికిలో అరకొరగా పంట దిగుబడి

ఏ పంట సాగు చేసినా రైతుకు మాత్రం ఏదో విధంగా కష్టాలు, నష్టాలు తప్పడం లేదు. ఇందుకు పత్తి రైతులే నిదర్శనం. పత్తి పంట ఏపుగా పెరిగినా దిగుబడి అంతంత మాత్రంగానే ఉంది. పోని దానికైనా గిట్టుబాటు ధర ఉందా అదీ లేదు. దీంతో రైతులకు నష్టాలు తప్పడం లేదు. మండలంలో 6695 ఎకరాల్లో పత్తిపంట సాగుచేశారు. యాడికి, కమలపాడు, చిక్కేపల్లి, నిట్టూరు, తిరుణాంపల్లి, తిప్పారెడ్డిపల్లి, కొట్టాలపల్లి, వేములపాడు, కుందనకోట, గుడిపాడు తదితర గ్రామాల్లో పత్తి పంటను సాగుచేశారు. గతేడాది సుమారు 11వేల ఎకరాల్లో పత్తి సాగుచేశారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల్లో పత్తి పంట సాగు విస్తీర్ణం తగ్గింది. దిగుబడి, ధర రెండూ తగ్గడంతో కనీసం పంటకు పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని పత్తి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత రెండేళ్లుగా మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించినా ఏమాత్రం ప్రయోజనం చేకూరలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- యాడికి, ఆంధ్రజ్యోతి

నాలుగు క్వింటాళ్లు కష్టమే..!



ఇంటిలో నిల్వ ఉంచిన పత్తి

ఈ ఏడాది పత్తిపంట దిగుబడి ఎకరాలకు నాలుగు క్వింటాళ్లు వచ్చేది కూడా కష్టమే అని పలువురు రైతులు తెలిపారు. గతంలో ఎకరాకు 10నుంచి 14క్వింటాళ్ల వరకు దిగుబడి తీశామని తెలిపారు. తెగుళ్లు, వర్షాభావ పరిస్థితుల్లో ఈ ఏడాది దిగుబడి పూర్తిగా తగ్గినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నకిలీ విత్తనాలు, తెగుళ్లు, వర్షాభావం వంటి పరిస్థితుల వల్ల పత్తి సాగుకు రైతులు ఆసక్తి చూపడం లేదు. దీంతో ఏడాదికేడాదికి పత్తి సాగు విస్తీర్ణం తగ్గిపోతోందని రైతులు తెలిపారు. నియోజకవర్గంలో ప్రధాన వాణిజ్య పంట అయిన పత్తి పంటకు గడ్డుకాలం వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో వేరుశనగ, ఇప్పుడు పత్తిపంట కనుమరుగవుతూ వస్తున్నాయని రైతులు తెలిపారు.

క్వింటా ధర రూ.ఆరు వేలే

పత్తి ధరలు పూర్తిగా తగ్గినట్లు రైతులు తెలిపారు. ప్రస్తుతం పత్తి క్వింటా రూ.ఆరువేలు మాత్రమే పలుకుతోంది. ఎకరాకు నాలుగు క్వింటాళ్ల దిగుబడి ప్రకారం రూ.24వేలు మాత్రమే వస్తుందని రైతులు తెలిపారు. పత్తిసాగుకు ఎకరాకు సేద్యపు పనులు, విత్తనం, పురుగు మందులు, కూలీల ఖర్చులు, రవాణా అంతా కలిపి రూ.25వేల వరకు ఖర్చు అవుతోందని రైతులు తెలిపారు. దీంతో అప్పులు మూటగట్టుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పత్తి క్వింటా రూ.9వేల నుంచి రూ.10వేల వరకు ధర పలికిందని, ఆ ధరలు వస్తేనే పత్తి రైతులు బాగుపడతారని వారు అభిప్రాయపడ్డారు. మరికొద్ది రోజులకు అయినా పత్తికి ధర రాకపోతుందా అనే ఆశాభావంతో కొందరు ఇళ్లలో నిల్వ ఉంచుకుంటున్నారు.

నాలుగు క్వింటాళ్ల దిగుబడి వస్తోంది..



నేను నాలుగు ఎకరాల్లో పత్తి సాగు చేశా. సుమారు లక్షరూపాయల వరకు పెట్టుబడి పెట్టా. ఎకరాకు నాలుగు క్వింటాళ్ల పత్తి వచ్చేది కష్టమే. పత్తి ధర క్వింటా రూ.6వేలు ఉంది. ఈ ధరతో రైతులకు ఏమి మిగలదు. ఏడాదికేడాది పత్తిలో నష్టాలు చూడాల్సి వస్తోంది. గతేడాది యాడికి మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించారు. ఎటువంటి కరువు సాయం అందలేదు. ఈ ఏడాదైనా ఎటువంటి సాయం అందిస్తారో వేచిచూడాలి.

నాగిరెడ్డి, పత్తిరైతు, చిక్కేపల్లి, యాడికి మండలం

క్వింటా రూ. 6 వేలతో నష్టమే..



నాలుగు ఎకరాల్లో పత్తి సాగుచేశా. ఎకరాకు నాలుగు క్వింటాళ్లకు కొంచెం అటుఇటుగా పత్తి దిగుబడి వస్తోంది. ప్రస్తుతం క్వింటా రూ.ఆరువేలు పలుకుతోంది. ఈ ధరలతో పత్తి రైతుకు నష్టమే. పత్తి ధరలు పెరుగుతాయోమేనని ప్రస్తుతం వచ్చిన దిగుబడిని ఇళ్లల్లో నిల్వ చేసుకుంటున్నాం. ధర పెరిగితే తప్ప గిట్టుబాటు కాదు. గతంలో పత్తి క్వింటా రూ.10వేల వరకు పలికింది. ఆ ధరలు మరలా వస్తేనే పత్తి రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది.

-రాఘవ, పత్తి రైతు, కొట్టాలపల్లి

మంచుకురిసే వేళలో...






వెండి వెన్నెల్లో..
వీధి దీపాల వెలుగులు
చిన్నబోతున్నాయి.
ఉషోదయ వేళ..
ఆకాశవీధి
ఒళ్లు విరుచుకుని
జన అర్ణవాన్ని
జీవనపోరాటానికి
మేల్కొలుపుతోంది.

అనంతపురం నగరంలోని గుత్తిరోడ్డులో ఆదివారం ఉదయం కనిపించిన దృశ్యం ఇది..

మనసు మురిసే వేళలో...



మంచు దుప్పటిని
మేలి ముసుగులా తొడిగిన ప్రకృతి కాంత
రవికిరణం సోకగానే
సిగ్గుల మొగ్గై..కెంపుల సోయగాన్ని అద్దుకుంది
ఆదిత్య హృదయం తెలిసిన
జలనిధి ఆనందపరవశమై
గుండెలకు హత్తుకుంది.

అనంత నగర శివారు చెరువు కట్టమీద సూర్యోదయ వేళ కనిపించిన దృశ్యం

రామ్మూర్తినాయుడుకు టీడీపీ నాయకుల నివాళి

అనంతపురం అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు సోదరుడు, మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తినాయుడుకు టీడీపీ నాయకులు ఆదివారం ఘనంగా నివాళులు అర్పించారు. స్థానిక టీడీపీ జిల్లా కార్యాలయంలో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొద్దీన్, రాష్ట్ర నాయకులు తలారి ఆదినారాయణ, ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, తెలుగు మహిళలు విశాలాక్షి, సంగా తేజస్విని, నాయకులు సరిపూటి రమణ, నారాయణస్వామి యాదవ్, సుధాకర్ యాదవ్, వెంకటరామయ్య, సిమెంట్ పోలన్న, కుంచెపు వెంకటేష్, కురబ నారాయణస్వామి తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు.



టీడీపీ కార్యాలయంలో నివాళులు అర్పిస్తున్న నాయకులు

కూటమి పాలనలో సీమకు అన్యాయం

వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం క్రైం,నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కూటమి పార్టీల పాలనలో రాయలసీమకు అన్యాయం జరుగుతోందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. నగరంలోని వైసీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెనుకబడిన రాయలసీమకు చంద్రబాబు న్యాయం చేయడం లేదన్నారు. కర్నూలులో గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన లోకాయుక్త, మానవహక్కుల కమిషన్ కార్యాలయాలను తరలించాలనుకోవడం తగదన్నారు. రాష్ట్ర విభజన తరువాత ఏపీకి కేంద్రం ఎయిమ్స్ కేటాయిస్తే దాన్ని అనంతపురంలో ఏర్పాటు చేస్తామని చెప్పి మంగళగిరికి తీసుకెళ్లారని మండిపడ్డారు. తిరుపతిలో కేన్సర్ ఆసుపత్రిని కేంద్రం మంజూరు చేస్తే దాన్ని కూడా కోస్తా జిల్లాలకు తరలించారని గుర్తు చేశారు. హంద్రీనీవాను శంకుస్థాపనలకే పరిమితం చేశారన్నారు. హంద్రీనీవా సామర్థ్యం 6200 క్యూసెక్కులకు విస్తరిస్తేనే రాయలసీమకు ప్రయోజనకరమన్నారు. గతంలో బీజేపీ రాయలసీమ డిక్లరేషన్ ప్రకటించిందన్నారు. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి చంద్రబాబు చేస్తున్న మోసాన్ని ప్రశ్నించరా అని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి గురించి చర్చించకుండా కేవలం జగన్‌ను విమర్శించడానికే అసెంబ్లీ సమావేశాలను పెట్టుకున్నట్లు కనిపిస్తోందన్నారు. ఏపీ అంటే అమరావతి, పోలవరమేనా అని ప్రశ్నించారు. సమావేశంలో వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సాకే చంద్రశేఖర్, నగరాధ్యక్షుడు చింతాసోమశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

ఘనంగా కోటి దీపోత్సవం

ఆత్మకూరు నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో ఆదివారం కార్తీక మాస కోటిదీపోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణస్వామి, తులసి అమ్మవారి కల్యాణోత్సవం నిర్వహించారు. ఆలయ అర్చకులు సుబ్రహ్మణ్యేశ్వరుడికి అభిషేకాలు అర్చనలు, పూజాకార్యక్రమాలు నిర్వహించారు. కోటిదీపోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే పరిటాల సునీత కుటుంబసభ్యులతో కలిసి పాల్గొన్నారు. స్వామివారి బంగారు కవచాన్ని ఆలయం చుట్టూ ప్రదక్షణ చేసి పూజా కార్యక్రమానికి అందజేశారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన స్వామివారి ఉత్సవ విగ్రహాలకు జ్వాలా తోరణం, కార్తీక మాస దీపోత్సవ పూజలు నిర్వహించారు. అనంతరం సుబ్రహ్మణ్యేశ్వరుడి మూల విరాట్‌ను దర్శించుకున్నారు.





కోటి దీపోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, ప్రత్యేక అలంకరణలో స్వామివారు

ఆ ఇద్దరిపై ప్రేమ ఎందుకో..?

పాత వారిని కదిలించాలంటూ పైనుంచి ఆదేశాలు
ఇద్దరు ఉపాధ్యాయులను కొనసాగిస్తున్న అధికారులు
జిల్లా విద్యాశాఖలో తీవ్ర చర్చ

అనంతపురం విద్య, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖలో డెప్యుటేషన్‌పై ఏపీఓ, ఏఎస్‌ఓలుగా పని చేస్తున్న ఉపాధ్యాయుల కొనసాగింపుపై విమర్శలు వినిపిస్తున్నాయి. వైసీపీ పాలనలో జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలోకి వచ్చి పని చేస్తున్న ఏఎస్‌ఓలు, ఏపీఓలను కదిలించి, కొత్త వారికి అవకాశం ఇవ్వాలంటూ విద్యాశాఖ రాష్ట్ర కార్యాలయం నుంచి ఇటీవల అన్ని జిల్లాల డీఈఓలకు మౌఖిక ఆదేశాలు వచ్చినట్టు తెలిసింది. ప్రకాశం జిల్లాలో ఇప్పటికే ఏఎస్‌ఓను కదిలించారు. ఆ జిల్లాలో 2022 నుంచి పనిచేస్తున్న ఏఎస్‌ఓను రీప్యాట్రియేట్ చేస్తూ అక్కడి డీఈఓ ఈ నెల 3న ఉత్తర్వులు జారీ చేశారు. ఇతర జిల్లాల్లో సైతం ఈ ప్రక్రియలో చలనం వచ్చింది. అనంతపురం జిల్లా డీఈఓ కార్యాలయంలో ఏఎస్‌ఓ, ఏపీఓలు సైతం గత వైసీపీ ప్రభుత్వంలో నియమితులై పనిచేస్తున్నారు. అయితే ఇప్పటి వరకూ వారిని కదిలించే యత్నాలు జరగలేదని విద్యాశాఖ వర్గాల ద్వారా తెలుస్తోంది. సమగ్రశిక్ష ప్రాజెక్టులోకి గత ప్రభుత్వంలో వచ్చిన పలువురు సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారులను కలెక్టర్ రీప్యాట్రియేషన్ చేశారు. కొత్త వారిని తీసుకోవడానికి ఆదేశాలు రావడంతో ఔత్సాహికుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. తర్వాత అర్హులకు ఇంటర్వ్యూలు కూడా నిర్వహించారు. నెలన్నర కిందటే ఈ ప్రక్రియ మొదలైంది. అయితే జిల్లా విద్యాశాఖలో పని చేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులను మాత్రం కదిలించలేదు. దీని వెనుక మతలబు ఏంటంటూ జిల్లాలోని ఉపాధ్యాయ సంఘాల నాయకులు, జిల్లా విద్యాశాఖ, సమగ్రశిక్ష ప్రాజెక్టులో పనిచేస్తున్న టీచర్లలో చర్చ మొదలైంది. దీని వెనుక ఏవైనా రాజకీయ శక్తులు పనిచేస్తున్నాయా..? లేక డీఈఓ ఆఫీస్‌లోని ఉన్నతాధికారులే మోకాలడ్డుతున్నారా? అన్న చర్చ కూడా జోరుగా సాగుతోంది. ఆ ఇద్దరు టీచర్లపై జిల్లా విద్యాశాఖాధికారి ప్రసాద్ బాబు ఏ నిర్ణయం తీసుకుంటారోనని అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.


PROCEEDINGS OF THE DISTRICT EDUCATIONAL OFFICER,
PRAKASAM DISTRICT: ONGOLE

ప్రకాశం జిల్లాలో ఏఎస్‌ఓను పంపుతూ ఇచ్చిన ఉత్తర్వు



తలపడుతున్న కర్ణాటక, తమిళనాడు జట్ల ఆటగాళ్లు

గోల్..నిల్..!

పోరాడకుండా ఓడిన ఆంధ్రా జట్టు

- అండమాన్ సునాయాస గెలుపు
- రసవత్తరంగా తమిళనాడు-కర్ణాటక మ్యాచ్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆతిథ్య జట్టుపై ఉన్న భారీ అంచనాలు పటాపంచలయ్యాయి. అండమాన్ నికోబర్‌తో జరిగిన మ్యాచ్‌లో పోరాడకుండానే ఆంధ్రా జట్టు ఓటమిపాలైంది. ఆదివారం స్థానిక అనంత క్రీడాగ్రామం ఆర్డీటీ స్టేడియంలో సంతోష్‌ట్రోఫీ ఫుట్‌బాల్ నేషనల్ పోటీలు నిర్వహించారు. ఉదయం ఆంధ్రప్రదేశ్, అండమాన్ నికోబర్ జట్ల మధ్య జరిగింది. మొదటి నుంచి ఎటువంటి పోరాట పటిమ ప్రదర్శించని ఏపీ జట్టు అండమాన్‌పై గోల్ తేడాతో ఓటమి పాలైంది. దీంతో ఆంధ్రా జట్టు రెండో ఓటమిని మూటగట్టుకుంది. అండమాన్ ప్లేయర్ గీతన్ రాజ్ చేసిన ఒకే ఒక్క గోల్‌తో గెలుపుసొంతం చేసుకుంది. మరో మ్యాచ్ మధ్యాహ్నం తమిళనాడు, కర్ణాటక జట్లు తలపడగా రసవత్తరంగా సాగింది. నువ్వా నేనా అన్న చందంగా గెలుపు అటుఇటూ నడిచింది. హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో కర్ణాటక జట్టులోని ప్లేయర్లు నిఖిల్‌రాజ్ ఒక గోల్ కొట్టాడు. తమిళనాడు జట్టులో లిజో, శరణ్ చెరో గోల్ కొట్టి జట్టును విజయతీరాలకు నడిపించారు. దీంతో తమిళనాడు రెండో విజయాన్ని నమోదు చేసింది.



ఆంధ్రా-అండమాన్ నికోబర్ జట్ల మధ్య పోరు



విజయం తరువాత ఆంధ్రా ఆటగాళ్లను ఓదారుస్తున్న అండమాన్ క్రీడాకారులు

కబడ్డీలో ఉద్దేహాళ్ జట్టుదే విజయం



కబడ్డీలో ప్రథమ బహుమతి పొందిన ఉద్దేహాలు జట్టు

విడపనకల్లు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాల్తూరు గ్రామంలో నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీలలో బొమ్మనహాల్ మండలం ఉద్దేహాళ్ జట్టు గెలుపొందిందినట్లు ఉరవకొండ సీఐ చిన్న గౌస్, పాల్తూరు ఎస్ఐ మురహరిబాబు తెలిపారు. శనివారం ఉదయం ఎస్పీ జగదీష్ జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ పోటీలను పాల్తూరు మైత్రి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించగా 60 జట్లు పాల్గొన్నాయి. వీటిలో పాల్తూరు, ఉద్దేహాల్ జట్లు ఫైనల్‌కు చేరాయి. ఫైనల్ మ్యాచ్ ఆదివారం నిర్వహించారు. పాల్తూరు జట్టుపై ఉద్దేహాల్ జట్టు విజయం సాధించింది. మొదటి బహుమతిగా రూ.10వేలు గెలుచుకున్నాయి. రన్నరప్ పాల్తూరు జట్టు రూ.5వేలు గెలుపొందారు. అనంతరం విజేత జట్లకు షీల్డ్ బహూకరించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో సీఐ చిన్నగౌస్ మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలన్నారు. ఆరోగ్యంతో పాటు ప్రతి ఒక్కరూ వ్యక్తిగత జీవన శైలిని మార్చుకోవాలి అన్నారు. కార్యక్రమంలో పాల్తూరు పోలీస్ సిబ్బంది, టీడీపీ మండల నాయకులు గడ్డం మారయ్య, కాలువ మారయ్య, కుమారుస్వామి, గంగన్న, వన్నూరు స్వామి పాల్గొన్నారు.

1 నుంచి పీఏబీఆర్ కుడికాలువకు నీటి విడుదల

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పీఏబీఆర్ కుడి కాలువకు డిసెంబరు 1వ తేదీ నుంచి నీటిని విడుదల చేయనున్నట్లు హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్ తెలిపారు. సెప్టెంబరు 19వ తేదీన నిర్వహించిన ఇరిగేషన్ అడ్వైజరీ బోర్డు (ఐఏబీ) సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు ఐఏబీ చైర్మన్, కలెక్టర్ వినోద్‌కుమార్ ఈ మేరకు అప్రూవల్ చేశారని తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లాతో పాటు శింగనమల, ఉరవకొండ, రాప్తాడు నియోజకవర్గాల పరిధిలో ఉన్న 33 చెరువులకు తుంగభద్ర జలాలను నింపుతామన్నారు. ఇందుకు కాలువ పరిసర ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేయాలని రెవెన్యూ, పోలీసు అధికారులకు సమాచారం ఇచ్చామని తెలిపారు. నీటి సరఫరా సక్రమంగా సాగేలా చర్యలు తీసుకుంటామన్నారు.

వైద్య సదస్సులతోనే పరిశోధనలకు పునాదులు

ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు



పెథాలజీ సదస్సులో జ్యోతిప్రజ్వలన చేస్తున్న డాక్టరు మాణిక్యాలరావు తదితరులు

అనంతపురంటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నిత్య వైద్య సదస్సులతోనే నూతన వైద్యరంగాలకు పునాదులు పడతాయని మెడికల్‌కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు అన్నారు. ఆదివారం మెడికల్ కలాశాలలో చర్మవ్యాధి సమగ్ర విశ్లేషణపై సదస్సు నిర్వహించారు. సదస్సుకు ప్రిన్సిపాల్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నూతన పరిశోధనలు, చికిత్సా పద్ధతులు, వ్యాధుల నివారణ పరిశోధనల ద్వారానే సాధ్యమవుతుందని అన్నారు. అందుకే వైద్యవిద్యార్థులు చదువుతో పాటు పరిశోధనలపైనా దృష్టి పెట్టాలని సూచించారు. క్రమం తప్పకుండా కళాశాలలోని ప్రతివిభాగం వైద్యులు నిరంతర వైద్యసదస్సులను నిర్వహించాలన్నారు. దీనివల్ల ఇక్కడ చదువుతున్న విద్యార్థులకు ప్రపంచస్థాయి వైద్యపరిజ్ఞానం చేరువవుతుందన్నారు. అనంతరం విశ్వభారతి మెడికల్ కాలేజీ పెథాలజీ విభాగాధిపతి డాక్టర్ నీరజ, సెయింట్‌జాన్స్ మెడికల్ కాలేజీ చర్మవ్యాధిశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ రాజ్యలక్ష్మి, కుప్పం మెడికల్ కాలేజీ పెథాలజీ విభాగాధిపతి డాక్టర్ ఏఎస్ రామస్వామి, శాంతిరామ్ మెడికల్ కాలేజీ పెథాలజీ విభాగాధిపతి డాక్టర్ జానకి వివిధ రకాల చర్మవ్యాధులు ఎలాసంక్రమిస్తాయి, వాటిని ఎలా గుర్తించాలి, నివారణకు ఎలాంటి చికిత్సలు తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంత వైద్య కలాశాల డాక్టర్లు శివశంకరనాయక్, లక్ష్మీ, శ్రీనివాసులు, సుమన్, భాగ్యలక్ష్మి, దివ్య, లక్ష్మి, దీప్తి, శ్రీధర్, చైతన్య, మల్లికాదేవి, మెడికోలు పాల్గొన్నారు.

డీసీఎంఎస్ సేవల విస్తృతంపై ప్రత్యేక దృష్టి

రైతులకు సొసైటీల ద్వారా ఎరువుల విక్రయం

జాయింట్ కలెక్టర్, పర్సన్ ఇన్‌చార్జి శివనారాయణశర్మ



డీసీఎంఎస్ వివరాలు తెలుసుకుంటున్న జాయింట్ కలెక్టర్ శివ నారాయణశర్మ

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): డీసీఎంఎస్ ద్వారా రైతులకు ఉపయోగకరమైన సేవలను విస్తృతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి, జాయింట్ కలెక్టర్ శివ నారాయణశర్మ అన్నారు. 71వ అఖిల భారత సహకార వారోత్సవాల సందర్భంగా ఆదివారం స్థానిక కమలానగర్‌లోని డీసీఎంఎస్ కార్యాలయంలో జేసీ చేతుల మీదుగా సహకార పతాకాన్ని ఆవిష్కరించి, ప్రతిజ్ఞ చేయించారు. ఆయన మాట్లాడుతూ డీసీఎంఎస్ పరిధి ఎంత, ఏయే ప్రాంతాల్లో ఏయే రకాల ఆస్తులు ఉన్నాయి, ఎంతమేర ఆదాయం వస్తోంది, ఎంత ఖర్చు చేస్తున్నారు, ఆదాయం-వ్యయం ఏ స్థాయిలో ఉందనే వివరాలపై ఆరా తీశారు. డీసీఎంఎస్‌లో వచ్చే ప్రతి పైసాకు లెక్క ఉండాలని, డీసీఎంఎస్ ఆవరణలో ఉన్న దుకాణాల అనుమతులు సక్రమంగా ఉండాలని సూచించారు. కాలానుగుణంగా డీసీఎంఎస్ సొసైటీల ద్వారా రైతులకు ఎరువుల విక్రయాలు, ప్రజలకు నాణ్యమైన నిత్యావసర సరుకులు తక్కువ ధరకు విక్రయించాలని సూచించారు. అనంతరం డీసీఎంఎస్ పరిసరాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. జిల్లా సహకార శాఖ అధికారి (డీసీఓ) అరుణకుమారి, ఆర్‌సీటీసీ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, సబ్ డీఎల్‌సీఓ బాలగంగాధర్, సహకార విద్యాశాఖాధికారి మోహన్‌మురళీ, డీసీఎంఎస్ జిల్లా మేనేజర్ విజయభాస్కర్, అసిస్టెంట్ మేనేజర్ సత్యనారాయణరెడ్డి, ఏఓ సుధాకర్ రెడ్డి, ఇఫ్‌కో ప్రతినిధి మణికళ్యాణ్, సభ్యులు పాల్గొన్నారు.

నేడు పుట్టపర్తిలో ట్రాఫిక్ మళ్లింపు

పుట్టపర్తిరూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా జయంత్యుత్సవాల్లో భాగంగా సోమవారం వేణుగోపాలస్వామి రథోత్సవాన్ని పురస్కరించుకుని పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేపట్టినట్లు ఎస్పీ రత్న ప్రకటనలో పేర్కొన్నారు. కొత్తచెరువు, అనంతపురం, ధర్మవరం, గోరంట్ల బెంగళూరు వైపు నుంచి వచ్చే వాహనాలను గణేష్ సర్కిల్ నుంచి చిత్రావతి వైపు మళ్లించామన్నారు. నల్లమాడ, కదిరి వైపు నుంచి వాహనాలను కర్ణాటకనాగేపల్లి బ్రిడ్జి నుంచి గణేష్ కూడలి వైపు మళ్లించామన్నారు. 21 నుంచి 23వ తేదీ వరకు అనంతపురం, కొత్తచెరువు, బెంగళూరు, గోరంట్లవైపు నుంచి వచ్చే వాహనాలను సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్, బ్రాహ్మణపల్లి, ఎనుమలపల్లి, చిత్రావతి రింగ్‌రోడ్డు వైపు మళ్లిస్తామన్నారు. ట్రాఫిక్ మళ్లింపును సత్యసాయిబాబా భక్తులు, ప్రజలు గమనించాలని ఎస్పీ సూచించారు. ఇందుకు సంబంధించి 14 పోలీసు బృందాలతో హనుమాన్ టెంపుల్, ఎనుమలపల్లి వద్ద అవుట్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు.

కింద పడి మధ్యప్రదేశ్ యువకుడి మృతి



దిలీప్ సాకేత్ మృతదేహం

గుత్తిరూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపేట సమీపంలో మద్యం మత్తులో కిందికి పడి మధ్యప్రదేశ్‌కు చెందిన దిలీప్ సాకేత్(22) అనే యువకుడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు కొత్తపేట వద్ద శివకృష్ణ కంస్ట్రక్షన్‌లో స్టోర్ లేబర్‌గా దిలీప్ సాకేత్ పనిచేస్తున్నారు. శనివారం రాత్రి మద్యంమత్తులో కొత్తపేట నుంచి ఫ్యాకరీ వద్దకు నడుచుకుంటూ వెళ్తుండగా కింద పడడంతో తోటి కూలీలు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నీటిమడుగులో పడి ఇద్దరు బాలికలకు అస్వస్థత




అస్వస్థతకు లోనైన సంగీత, పవిత్ర

గుమ్మఘట్ట, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కలుగోడు గ్రామంలో ఆదివారం తల్లితో పాటు బట్టలు ఉతికేందుకు వేదవతి హగరికి వెళ్లి నీటి మడుగులో పడి ఇద్దరు బాలికలు అస్వస్థతకు గురయ్యారు. సమీపంలోని గ్రామస్థులు వారిని కాపాడి రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గ్రామస్థులు కుటుంబసభ్యులు తెలిపిన మేరకు గ్రామానికి చెందిన దళిత హనుమంతు భార్య శృతి ఇద్దరి కూతుర్లు సంగీత, పవిత్రలకు ఆదివారం సెలవు కావడంతో హగరి నదిలో బట్టలు ఉతికేందుకు తీసుకెళ్లింది. అక్కడ నీటిమడుగులో సరదాగా ఈత కొడుతూ వారిద్దరూ నీట మునిగిపోయారు. తల్లి కూడా మడుగులో నీరు ఎక్కువగా ఉండడంతో కాపాడే ప్రయత్నంలో నీటిలో మునుగుతుండగా సమీపంలో ఉన్న గ్రామస్థులు అప్రమత్తమై వెంటనే తల్లికూతుర్లను బయటకు తీశారు. తల్లి క్షేమంగా ఉండగా కూతుళ్ల సంగీత, పవిత్ర అప్పటికే నీరు తాగి కడుపు ఉబ్బి స్పృహ కోల్పోయారు. వెంటనే కుటుంబసభ్యులు, గ్రామస్థులు రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. గుమ్మఘట్ట పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

నీటి తొట్టెలో పడి చిన్నారి మృతి

శింగనమల నవంబరు 17(ఆంధ్రజ్యోతి): నీటి తొట్టెలో పడి ఓ చిన్నారి మృతిచెందిన ఘటన ఆదివారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. అనంతపురానికి చెందిన ప్రసాద్ ప్రసన్న దంపతులు కుమరుడు రోషన్ కుమార్ (3)తో కలిసి ఆదివారం స్థానిక చర్చిలో ప్రార్థనల కోసం వచ్చారు. తల్లిదండ్రులు చర్చిలో ప్రార్థనలు చేస్తుండగా చిన్నారి ఆడుకుంటూ చర్చి అవరణలో ఉన్న తొట్టెలో పడ్డాడు. అక్కడ ఉన్నవారు గమనించి చిన్నారిని బయటికి తీసి స్థానిక ఆసుప్రతికి తరలించారు. చిన్నారి పరిస్థితి విషమంగా ఉండటంతో ఆనంతరపురం ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ చిన్నారి మృతి చెందాడు. శింగనమల ఎస్ఐ విచారించగా తొట్టెలో పడి చిన్నారి మృతి చెందిన మాట వాస్తవమని, అయితే తల్లిదండ్రులు ఎలాంటి ఫిర్యాదు చేయలేదన్నారు.

మద్యం అధిక ధరలకు విక్రయిస్తే కేసులు: డీసీ



రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

గుత్తి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మద్యాన్ని ఎమ్మార్పీ కన్నా అధిక రేట్లకు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి హెచ్చరించారు. స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌ను ఆదివారం సాయంత్రం తనిఖీ చేశారు. కర్ణాటక నుంచి అక్రమ మద్యం, నాటుసారా తయారీ అమ్మకాలు అరికట్టాలన్నారు. రెండు అంతకంటే ఎక్కువ కేసులు ఒక వ్యక్తి మీద నమోదు అయితే పీడీ యాక్ట్ నమోదు చేయాలన్నారు. పాతనేరస్థుల మీద ఒక సంవత్సర కాలానికి రూ.లక్ష పూచీకత్తు మీద బైండోవర్ చేయాలని ఆదేశించారు. ఎవరైనా బెల్ట్ షాపులు నిర్వహిస్తే వారి మీద కేసులు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు గోపాల్, అస్లాంబేగ్, సిబ్బంది పాల్గొన్నారు.

రిజర్వాయర్‌కు 1084 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు ఆదివారం కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 1084 క్యూసెక్కులు వస్తున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్‌ఎన్‌ఎస్ఎస్-2కు 987 క్యూసెక్కులు వెళుతున్నట్లు చెప్పారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.583 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

ఆధునిక జీవిత సంఘర్షణలకు ప్రతిబింబాలు ప్రగతి కథలు

యోగివేమన విశ్వవిద్యాలయం ఆచార్యులు వినోదిని



పుస్తకావిష్కరణ చేస్తున్న సాహితీకారులు

అనంతపురం కల్చరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆధునిక జీవిత సంఘర్షణలకు ప్రతిబింబాలు ప్రగతి కథలు అని యోగివేమన విశ్వవిద్యాలయం ఆచార్యులు డాక్టర్ యం.వినోదిని అన్నారు. రచయిత్రి డాక్టర్ ప్రగతి రచించిన 'కొన్ని చీకట్లు... ఓ వెలుతురు' అనే కథా సంపుటి పరిచయ సభను ఆదివారం స్థానిక ఎన్జీఓ హోంలో నిర్వహించారు. కార్యక్రమానికి వినోదిని ముఖ్యఅతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. అమ్మ మనసుతో ప్రగతి కథా సాహిత్య సృజన చేశారని, ఆధునిక జీవితంలోని సౌందర్యాన్ని, సంఘర్షణలను అక్షరబద్ధం చేశారన్నారు. కవి తూముచెర్ల రాజారామ్ మాట్లాడుతూ వ్యక్తిగత స్వేచ్ఛను గుర్తించాల్సిన అవసరాన్ని ఆధునిక సమాజంలో మనుషులు మరింత ఆధునికం కావాల్సిన సందర్భాలను ఈ కథలు వివరిస్తాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అంకె శ్రీనివాస్, డాక్టర్ హెచ్ పల్లవి, చంద్రశేఖర శాస్త్రి, చిలుకూరి దీవెన, యమునారాణి, శేషగిరి నాయుడు, శోభామణి, హేమామాలిని, యాములపల్లి నర్సిరెడ్డి, డాక్టర్ రాధేయ, ఉప్పరపాటి వెంకటేశులు, సత్యబోస్, గోవిందరాజులు, తరిమెల అమర్నాథరెడ్డి, జెట్టి జైరామ్, టీవీ రెడ్డి పాల్గొన్నారు.

మహిళా సెక్యూరిటీ గార్డు ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, నవంబరు17(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదిలి గ్రామం వద్దగల శాడిల్స్ కియ అనుబంధ పరిశ్రమలో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డు రాజేశ్వరి ఆదివారం క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. ఆదే పరిశ్రమలో పనిచేస్తున్న సెక్యూరిటీ సూపర్ వైజర్ త్రివేదిలాల్‌నాయక్ వేధించడంతో పాటు దాడి చేశాడంటూ గోరంట్ల పోలీసు స్టేషన్‌లో రాజేశ్వరి ఫిర్యాదు చేసింది. ఆ మేరకు కేసు నమోదు చేశారు. కార్మిక సంఘం నాయకులు ఆమెకు మద్దతుగా నిలిచారు. పరిశ్రమ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి, న్యాయం చేయాలని పట్టుబట్టారు. ఈనేపథ్యంలో సూపర్‌వైజర్ త్రివేదిలాల్‌నాయక్‌ను విధుల నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించారు. రాజేశ్వరికి కూడా ఉద్వాసన పలకనున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్తాపం చెందిన రాజేశ్వరి గోరంట్లలోని పులేరు రోడ్డులో విషం తాగి, ఆత్మహత్యకు యత్నించింది. అస్వస్థతకు లోనైన ఆమెను గోరంట్ల ప్రభుత్వ ఆసుప్రతికి తీసుకొచ్చారు. మెరుగైన వైద్యం నిమిత్తం 108లో హిందూపురం తరలించారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శేఖర్ తెలిపారు.

విద్యుదాఘాతంతో యువరైతు మృతి



ఆంజనేయులు (ఫైల్)

బుక్కరాయసముద్రం, నవంబరు17(ఆంధ్రజ్యోతి): మండలంలోని పొడరాళ్ల గ్రామంలో ఆదివారం రాత్రి రైతు ఆంజనేయులు (29) విద్యుదాఘాతంతో మరణించాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పొడరాళ్ల గ్రామానికి చెందిన రైతు ఆంజనేయులు తనకున్న ఐదెకరాల పొలంలో మొక్కజొన్న, దానిమ్మ పంటలు సాగు చేశాడు. ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో తోటకు నీరు పెట్టడానికి వెళ్లాడు. తోటలో విద్యుత్ స్టార్టర్ పెట్టె ఆన్ కాలేదు. తోటి రైతులకు ఫోన్ చేసి సమస్యను తెలిపాడు. విద్యుత్ స్టార్టర్ పెట్టె మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలింది. దీంతో అక్కడికక్కడే మరణించాడు. ఆంజనేయులకు భార్య అరుణ, ఇద్దరు పిల్లలున్నారు. ప్రమాదంపై బుక్కరాయసముద్రం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి

పోలీసుల అదుపులో భార్య

కళ్యాణదుర్గం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని పీటీఆర్ పల్లి తండాలో పశ్చిమబెంగాల్‌కు చెందిన బీజయ్ సర్దార్ (35) అనుమానాస్పద స్థితిలో ఆదివారం రాత్రి మృతిచెందాడు. ఇదే విషయమై అతడి భార్య గీతాబాయిని పోలీసులు అదుపులోకి తీసుకుని, విచారిస్తున్నట్లు తెలిసింది. బీజయ్ సర్దార్, గీతాబాయి ఇద్దరూ బెంగళూరులో కూలి పనులు చేసుకుంటుండేవారు. అక్కడ వారి మధ్య ప్రేమ ఏర్పడి, పెళ్లి చేసుకున్నారు. మూడేళ్ల క్రితం గీతాబాయి స్వగ్రామమైన పీటీఆర్ పల్లి తండాకు వచ్చారు. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. ఈ క్రమంలో తాగుడుకు బానిసైన బీజయ్ సర్దార్ రోజూ గీతాబాయిని అనుమానిస్తూ వేధించేవాడు. ఆదివారం సాయంత్రం కూడా భార్యను మాటలతో వేధిస్తూ, ఘర్షణకు దిగాడు. ఈ నేపథ్యంలో అతడు శవమయ్యాడు. ఇతడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతిపై కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చారు.

పోలీసు ఫిర్యాదుల పరిష్కార వేదికకు ఆధార్ తప్పనిసరి

AADHAAR

పుట్టపర్తిరూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజాఫిర్యాదుల పరిష్కారవేదిక కార్యక్రమానికి వచ్చేవారు తప్పనిసరిగా ఆధార్‌కార్డు తీసుకురావాలని జిల్లా పోలీసు కార్యాలయం ఆదివారం ప్రకటనలో పేర్కొంది. ఈవిషయాన్ని ప్రజలందరూ గమనించాలని అందులో కోరారు.

బకాయిల సాధనకు ఉద్యమబాట

ఏపీటీఎఫ్ రాష్ట్ర, జిల్లా నాయకులు



మాట్లాడుతున్న జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీనివాసనాయక్

అనంతపురం విద్య, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, ఉద్యోగ బకాయిలు చెల్లించకుంటే ఉద్యమం తప్పదని ఏపీటీఎఫ్ నాయకులు హెచ్చరించారు. ఆదివారం ఉపాధ్యాయ భవన్‌లో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసనాయక్ మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఆర్థిక ప్రయోజనాలు, మొండి బకాయిలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలన్నారు. చలనం లేకుండా వ్యవహరిస్తే ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. డిసెంబర్ 16, 17 తేదీల్లో జిల్లా స్థాయిలో, జనవరిలో రాష్ట్ర స్థాయిలో పోరాటాలు, నిరసన కార్యక్రమాలు చేపడుతామన్నారు. రాష్ట్ర పూర్వపు ప్రధానకార్యదర్శి కులశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ- టీచర్ల సమస్యల పరిష్కారంలో ఏపీటీఎఫ్ ముందుంటుందన్నారు. 12వ పీఆర్సీకి సంబంధించి 30 శాతం ఐఆర్ సాధనకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని, 117 జీవో రద్దుకు మండలాల్లో తీర్మానాలు చేయాలన్నారు. డిసెంబర్, జనవరిలో పోరాటాలకు సిద్ధంగా ఉండాలని తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, కార్యదర్శి మహ్మమద్ రఫీ, జిల్లా గౌరవాధ్యక్షుడు వరప్రసాద్, పూర్వపు రాష్ట్ర కార్యదర్శి వెంకటరెడ్డి, పూర్వపు అధ్యక్షులు రవీంద్ర, అదనపు కార్యదర్శి ఆంజనేయులు నాయక్, అశోక్‌నాయక్, వజీర్ బాషా, రామాంజనేయులు పాల్గొన్నారు.

'క్షుద్ర వజ్రం' ఖబడ్దార్: టీడీపీ



మాట్లడుతున్న టీడీపీ నాయకులు

కదిరి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): క్షుద్రపూజలు చేస్తూ పోలీసులకు పట్టుబడిన క్షుద్ర వజ్ర భాస్కర్‌రెడ్డి టీడీపీ జోలికొస్తే ఖబడ్దార్ అని ఆ పార్టీ నాయకులు హెచ్చరించారు. ఆదివారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. క్షుద్రపూజలు చేసి, పోలీసులకు అడ్డంగా దొరికిన నీవు టీడీపీ నాయకుల గురించి మాట్లాడతావా అని ప్రశ్నించారు. క్షుద్రపూజలు చేయడనికి కాకపోతే రాష్ట్రంలో ఇన్ని ప్రధాన దేవాలయాలుంటే అడవిలో ఉన్న ఆ దేవాలయానికి అర్ధరాత్రి ఎందుకెళ్లావని ప్రశ్నించారు. క్షుద్రపూజలు చేస్తున్న నిన్న స్థానిక గ్రామస్థులు అడ్డుకోలేదా అని ప్రశ్నించారు. నీ వ్యక్తిగత జీవితంతోపాటు రాజకీయ జీవితం కూడా ప్రజలకు తెలుసన్నారు. డబుల్ రిజిస్ట్రేషన్లు, చెల్లని చెక్కులు, ప్రభుత్వ భూముల కబ్జా లాంటి ఎన్నో అక్రమాలు చేసిన నీవు మా నాయకుల గురించి మాట్లాడే అర్హత ఉందా అని ప్రశ్నించారు. నమ్మి నీవెంట వచ్చిన ఆడపడచులను కూడా మోసం చేసిన ఘనుడవు నీవని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే ఎన్నికల్లో అందరూ పోటీ చేస్తారని, ప్రజా బలం ఉన్నవారే గెలుస్తారని గుర్తుంచుకోవాలన్నారు. కనీసం కౌన్సిలర్‌గా కూడా గెలవలేని నీవు మానాయకుని పేరు ఉచ్ఛరించడానికి అర్హత లేదన్నారు. అభివృద్ధి గురించి నీవు చెబుతున్నవన్నీ తప్పుడు మాటలేనని, ఈ విషయం కదిరి ప్రజలందరికీ తెలుసన్నారు. అక్రమాలు, అన్యాయాలు మానేసి, సక్రమంగా ఉండేది నేర్చుకోవాలని హితవు పలికారు. సమావేశంలో టీడీపీ పట్టణాధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, రాజశేఖర్ బాబు, శేషు, ఉపేంద్రరెడ్డి, మాజీ కౌన్సిలర్ చంద్రశేఖర్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

క్షుద్రపూజలు చేయలేదు

- వజ్ర భాస్కర్‌రెడ్డి



మాట్లాడుతున్న వజ్ర భాస్కర్‌రెడ్డి

కదిరి, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట సమీపంలోని నారాయణ దేవాలయంలో తాను క్షుద్రపూజలు చేయలేదని కేవలం పూజలు మాత్రమే చేశానని, వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్రభాస్కర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన కార్యాలయంలో అన్నమయ్యజిల్లాకు చెందిన వైసీపీ నాయకులు ఏవీ సుబ్బారెడ్డితో కలి ఆయన మాట్లడుతూ కార్తీక పౌర్ణమిరోజున పూజలు చేయడానికి వెళ్లానని క్షుద్రపూజలు చేయలేదన్నారు. టీడీపీ నాయకులు తనపై అనవసరంగా ఆరోపణలు చేస్తున్నారన్నారు. సంపాదించిన దానిలో సేవా కార్యక్రమాలు చేస్తున్నానని పేర్కొన్నారు. తనను ఎవరైనా విమర్శిస్తే నాలుకలుండవని హెచ్చరించారు. తనపై ఆరోపణలు చేసినవారందరికీ ఆ దేవుళ్లే శిక్షిస్తారని అన్నారు.

సంక్షిప్తం

తగ్గిన పశువుల సంత ఆదాయం

అనంతపురంరూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లోని వారాంతపు పశువుల సంత ఆదాయం తగ్గింది. గడిచిన సంతలతో పోలిస్తే ఈ వారం దాదాపు రూ. 50వేల మేరకు ఆదాయం తగ్గిపోయింది. కార్తీక మాసం కావడంతో సంత ఆదాయం కొంత వరకు తగ్గినట్లు మార్కెట్ అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా గొర్రెలు, మేకల సంతతోనే ఈ వారం ఆదాయం తగ్గినట్లు తెలుస్తోంది. ఈవారం గొర్రెలు, మేకల సంత ద్వారా రూ. 2,67,200 మార్కెట్‌కు ఆదాయం సమకూరింది. ఆదివారం జరిగిన ఎద్దులు, ఎనుముల సంతతో రూ.1,61,150 ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు.

దరఖాస్తు చేసుకోండి

గార్లదిన్నె, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏపీఆర్ఎస్ మైనార్టీ గురుకుల పాఠశాలలో సోషియల్ (టీజీటీ) ఉపాధ్యాయుడి పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ అంజనేయులు నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో గత కొద్దిరోజుల నుంచి సోషియల్ ఉపాధ్యాయుడి పోస్టు ఖాళీగా ఉందన్నారు. బీఈడీ సోషియల్ మెథడాలజీ ఉండాలని తెలిపారు. నెలకు వేతనం రూ. 14800 అని, ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 8712625062 నంబరులో సంప్రదించాలన్నారు.

మైనార్టీల పథకాలు పునరుద్ధరించాలి

● ఐఎంఎం రాష్ట్ర అధ్యక్షుడు

అనంతపురం కల్చరల్, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): మైనార్టీలకు స్కాలర్‌షిప్‌లు, పెన్షన్లు, దుల్హన్ పథకం అమలు చేయాలని ఐఎంఎం రాష్ట్ర అధ్యక్షుడు మహబూబ్‌బాషా డిమాండ్ చేశారు. రామ్‌నగర్ పరిధిలో ఆదివారం 60 మంది మహిళలతో ఐఎంఎం మహిళా కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మహబూబ్‌బాషా మాట్లాడుతూ... గత వైసీపీ ప్రభుత్వంలో ఇళ్ల స్థలాలు, పెన్షన్లు, దుల్హన్ పథకాలు ఏ ఒక్క ముస్లింకు అందలేదన్నారు. దీంతో రాష్ట్రంలో టీడీపీ అధికారం చేపట్టేందుకు గత ఎన్నికల్లో ముస్లింలు ఎనలేని కృషి చేశారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనైనా ముస్లీం మైనార్టీలకు ఇళ్ల స్థలాలు, స్కాలర్‌షిపులు, దుల్హన్ పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

మిత్రుడి కుటుంబానికి చేయూత



ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తమతోపాటు చదువుకున్న బాల్యమిత్రుడు మృతిచెందడంతో ఆ కుటుంబానికి ఆయన మిత్రబృందం ఆర్థిక చేయూత నందించి అండగా నిలిచింది. నగరంలోని లాల్ బహదూర్ స్కూల్‌లో 1999 పదోతరగతి బ్యాచ్‌లో చదువుకున్న కృష్ణ అనారోగ్య సమస్యలతో ఇటీవల మృతి చెందాడు. ఈ నేపథ్యంలో అదే బ్యాచ్‌కు చెందిన తోటి మిత్రులు ఆదివారం కృష్ణ సతీమణి సునీతను కలిసి రూ.1,01,500 నగదును అందజేశారు. కార్యక్రమంలో కృష్ణ బాల్య మిత్రులు ముత్యాల సాయి నాథ్‌బాబు, రమేష్‌రెడ్డి, నవీన్ కుమార్, అర్జున్ కుమార్, ఆనంద్, జగదీష్, అమీర్, శర్మాస్ వలి, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తికి గాయాలు

గార్లదిన్నె, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కనుంపల్లి సమీపంలో 44వ జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం లారీ ఢీకొని కర్నూల్‌కు జిల్లాకు చెందిన వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. కర్నూల్ జిల్లా కల్లూరు మండల కేంద్రానికి చెందిన నందకుమార్ శర్మ అనంతపురంలో ఉన్న తన కుమార్తెను చూడడానికి ఆదివారం ఉదయం ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. కనుంపల్లి సమీపంలో హైదారాబాదు నుంచి అనంతపురం వైపు వస్తున్న లారీ ఢీ కొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో నందకుమార్ శర్మ తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ మహమ్మద్ గౌస్‌బాషా సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదంపై ఆరా తీశారు. ప్రమాదానికి కారణమైన లారీని, డ్రైవర్‌ను పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టారు. అనంతపురం మార్కెట్ యార్డులో ఉన్న లారీని, డ్రైవర్ ప్రమోద్‌కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

సన్మానం



మూర్తికి సన్మానం చేస్తున్న నాయకులు

అనంతపురం అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా నియమితులైన పీఎల్ఎన్‌మూర్తిని పలువురు టీడీపీ నాయకులు సన్మానించారు. అనంతపురం నగర శివారులోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం 44వ డివిజన్ టీడీపీ నాయకులు దుర్గా ప్రసాద్ రాయల్, వినయ్‌కుమార్, బాబా ఫక్రుద్దీన్, మహేంద్ర, దాదా, నవీన్ చరణ్, కుమార్‌లు ఆయనకు శాలువ కప్పి, పూల మాల వేసి ఘనంగా సన్మానించారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని వారు ఆకాంక్షించారు.

అభివృద్ధి పరుగులు..!

● జోరుగా సీసీరోడ్ల నిర్మాణం
● మండల వ్యాప్తంగా రూ. 5కోట్లతో పనులు



కురుగుంట వైఎస్సార్ కాలనీలో గతంలో ఇలా...



ఇప్పుడు...

అనంతపురం రూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): గ్రామాలే అభివృద్ధికి పట్టుగొమ్మలు.... గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రాభివృద్ధి చెందుతుంది... అని నిత్యం ప్రజాప్రతినిధులు చేప్పేమాటలు. వాటిని గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా మరిచింది. ఎన్నికల ముందు హడావుడిగా పనులు చేపట్టేందుకు ప్రయత్నాలు చేసినా కార్యరూపం దాల్చింది అంతంత మాత్రమే. అయితే కూటమి ప్రభుత్వం రాగానే గ్రామాభివృద్ధి కి శ్రీకారం చుట్టింది. గ్రామాల్లో ఐదేళ్లగా మరుగున పడిన సీసీరోడ్లకు మోక్షం కలిగింస్తోంది. ఈక్రమంలో మండల వ్యాప్తంగా దాదాపు5.14కోట్లతో పనులు జోరుగా సాగుతున్నాయి.

జోరుగా సీసీ రోడ్ల నిర్మాణం

రాప్తాడు నియోజకవర్గం పరిధిలోని అనంతురం రూరల్ మండలంలో 21గ్రాయ పంచాయతీలున్నాయి. ఒకటి రెండు మినహా మిగిలిన అన్ని పంచాయతీల్లో నెల రోజుల కిందట సీసీరోడ్ల నిర్మాణానికి రూ.5.14 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఇందులో అత్యధికంగా పాపంపేట పంచాయతీలో 22 సీసీరోడ్లకు రూ.1.39 కోట్లతో పనులు జరుగుతున్నాయి. ఇటుకలపల్లి, చియ్యేడు గ్రామాల్లో రూ.15 లక్షలు చొప్పున, ఆలమూరు రూ.20 లక్షలు, కక్కలపల్లి కాలనీ రూ.43 లక్షలు, కక్కలపల్లి రూ.17 లక్షలతో పనులు జరుగుతున్నాయి. కందుకూరు పంచాయతీ పరిధిలోని కందుకూరు, కృష్ణంరెడ్డిపల్లిలో రూ.60 లక్షలు, కామరుపల్లిలో రూ.10 లక్షలు, పూలకుంటలో రూ.10 లక్షలు, రాచానపల్లి పంచాయతీలోని రాచానపల్లి, సిండికేట్‌నగర్‌లో రూ.32 లక్షలు, సోములదొడ్డి పంచాయతీ పరిధిలోని సోములదొడ్డి, పాములరాయి గ్రామాల్లో రూ.31 లక్షలతో పనులు సాగుతున్నాయి. అదేవిధంగా కురుగుంటలో రూ.30 లక్షలు, కాటిగాని కాలువలో రూ.12 లక్షలు, తాటిచెర్ల లో రూ.20లక్షలు, ఉప్పరపల్లిలో రూ.10 లక్షలు, మన్నీలలో రూ.10 లక్షలు చొప్పున సీసీరోడ్ల నిర్మాణానికి కేటాయించారు. ఇందులో ఇప్పటికే పాపంపేట, ఆలమూరు, కందుకూరు, తాటిచెర్ల, కామారుపల్లి, కక్కలపల్లి కాలనీ, కురుగుంట తదితర ప్రాంతాల్లో రోడ్డు నిర్మాణాలు జరుగుతున్నాయి. కొన్ని పూర్తై, ఆయా ప్రాంతాల్లో అభివృద్ధిక చిహ్నాలుగా నిదర్శనంగా కనిపిస్తున్నాయి.



తాటిచెర్లలో అప్పుడు...



ఇప్పుడు...

టీడీపీతోనే అభివృద్ధి, సంక్షేమం



తెలుగుదేశం పార్టీతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యం. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన కొన్ని రోజుల్లోనే గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించింది. ఆ మేరకు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయడంతో పాటు పనుల ప్రారంభించాం. గ్రామాల్లో జరుగుతున్న పనులు ఇందుకు నిదర్శనం. సంక్షేమ కార్యక్రమాల అమలులోను కూటమి ప్రభుత్వం ఇదే రీతిలో ముందుకు సాగుతోంది.

- పాములరాయి రఘు,
టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి

అప్పుడు గ్రామాలను గాలికొదిలేశారు



గత వైసీపీ ప్రభుత్వంలో గ్రామాల ను గాలికొదిలే శారు. అభివృద్ధిని పూర్తిగా విస్మరించారు. దీంతో గ్రామాల్లో నెలకొన్న సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బం దులు పడ్డారు. ముఖ్యంగా రోడ్ల దుస్థితి అధ్వానంగా ఉండేది. ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే పరిటాల సునీత తన ప్రచారంలో రోడ్ల సమస్య పరిష్కరి స్తామని హామీ ఇచ్చారు. ఆ మేరకు మొదటి ప్రాధా న్యం గా చాలా ఇబ్బందిగా ఉన్న ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణా లు చేపట్టాం. ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

- రాగే మురళీ మోహన్,
టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి, ఆకుతోటపల్లి

రామ్మూర్తినాయుడుకు నివాళులు



టీడీపీ అర్బన్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న నాయకులు

అనంతపురం అర్బన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోదరుడు రామ్మూర్తినాయుడుకు టీడీపీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తలారి ఆదినారాయణ, నాయకులు గంగారామ్, సరిపూటి రమణ, నారాయణస్వామి యాదవ్, సంగా తేజస్విని, చెరుకుతోట పవన్‌కుమార్, నాగభూషణం, రామకృష్ణనాయుడు తదితరులు నగరం లోని టీడీపీ అర్బన్ కార్యాలయంలో రామ్మూర్తినాయుడు ఫొటోకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కార్యవర్గం ఎంపిక



కొత్తగా ఎంపికైన సభ్యులు

అనంతపురం విద్య, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) జిల్లా బాలికల కొత్త కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. సీపీఐ ఆఫీస్‌లో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు హనుమంతరాయడు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తర్వాత బాలిక కొత్త కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా బాలికల కన్వీనర్‌గా రాధాజ్యోతి, కో-కన్వీనర్లు సాయిస్వరూప, శృతి, సభ్యులుగా వెనెన్నల, అను, మంజుల, రాజా, రమ్యశ్రీ, చందన, మమత, త్రివేణిని ఎంపిక చేశారు. రాధాజ్యోతి, సాయి స్వరూప, శృతి మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు.

టీడీపీ సభ్యత్వంతో భరోసా

అనంతపురం రూరల్, నవంబరు17(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వం భద్రతకు భరోసా లాంటిందని చిన్నంపల్లి సర్పంచు శివశంకర్ అన్నారు. పంచాయితీ పరిధిలోని మల్లయ్య కొట్టాల గ్రామంలో ఆదివారం సభ్యత్వ నమోదు పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంద ర్భంగా టీడీపీ సభ్యత్వం తీసుకోవడం వలన కలిగే ప్రయోజనాలను కాలనీ వాసులకు వివరించారు. ఇదే సందర్భంలో కాలనీలోని సమస్యలను స్థానికులు సర్పంచు దృష్టికితీసుకొచ్చారు. కాలనీలోకి వచ్చే వంకపై కల్వర్టు నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు. అదేవిధంగా కురుగుంట, పాపంపేటలో సభ్యత్వ నమోదు ముమ్మరంగా సాగింది. తెలుగురైతురాప్తాడు నియోజక వర్గం అధ్యక్షుడు నారాయణస్వామి, స్టోర్ డీలర్లు రామాంజినేయులు, బాబావలి తదితరులు స్థానికులతో టీడీపీ సభ్యత్వాన్ని చేయించారు.

● రాప్తాడు: టీడీపీ సభ్యత్వ నమోదులో రాప్తాడు మండలంలోని బండమీద పల్లి ప్రస్తుతం నియోజకవర్గంలోనే అగ్రస్థానంలో ఉందని ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి దగ్గుపాటి శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని బండమీద పల్లిలో ఆదివారం ఇంటింటికీ తిరుగుతూ టీడీపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ... నియోజకవర్గం లోని ఆరు మండలాల్లో ఇప్పటి వరకూ రాప్తాడు మండలం ఐదు వేల పైన సభ్యత్వాలు నమోదు చేసి అగ్రస్థానంలో ఉందన్నారు. బండమీద పల్లిని 950 సభ్యత్వాలతో అగ్రస్థానంలో ఉంచామన్నారు. ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశాల మేరకు ఇంటింటికీ తిరిగి సభ్యత్వాలు చేయిస్తున్నామన్నారు.

వడ్డెర్ల సమస్యలు పరిష్కరించాలి

● ఎమ్మెల్యే పరిటాల సునీతకు వినతి



ఎమ్మెల్యేకి వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

ఆత్మకూరు, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వడ్డెర్ల సమస్యలు పరిష్కరించాలని టీడీపీ బీసీ సెల్ రాష్ట్రం అధికార ప్రతినిధి వడ్డె నాగేంద్ర, సాధికార కమిటి రాప్తాడు నియోజకవర్గం అధికార ప్రతినిది సరళ కోరారు. ఈ మేరకు వారు ఆదివారం ఎమ్మెల్యే పరిటాల సునీతను ఆమె క్యాంపు కార్యాలయంలో కలి సి వినతి పత్రం అందజేశారు. వడ్డెర్ల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి తమను ఆదుకోవాలని కోరారు. వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలని, ప్రముఖ స్వాతంత్ర సమరయోదుడు వడ్డె ఓబన్న జయంతిని అధికారికంగా ప్రకటించాలన్నారు. కొండ క్వారీలలో పనిచేస్తున్న వారికి రూ.10లక్షలు బీమా ప్రకటించాలని, కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు వడ్డె సూరన్న పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలకు ఆహ్వానం

రామగిరి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రామగిరి శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలకు ఎమ్మెల్యే పరిటాల సునీతను గ్రంథాలయాధికారి వెంకటేశ్ ఆహ్వానించారు. ఆయన ఆదివారం వెంకటాపురం గ్రామంలో ఎమ్మెల్యేని కలిసి గ్రంథాలయ వారోత్సవాలకు హాజరుకావాలని కోరారు. ఆయన వెంట టీడీపీ నాయకులు రామ్మూర్తినాయుడు, పరంధామయాదవ్, గుర్రం శీన, రామాంజినేయులు పాల్గొన్నారు. మండలంలోని నసనకోట సమీపాన ఉన్న తిరుమల దేవర ఆలయంలో ఆదివారం ఎమ్మెల్యే సునీత ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంజనేయస్వామి ఆలయంలో పూజలు చేయించారు.

క్రీడలతో మానసిక ఉత్తేజం : ఏఎస్పీ



మట్లాడుతున్న ఏఎస్పీ మల్లికార్జున వర్మ

శింగనమల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): క్రీడల వల్ల మానసిక ఉత్తేజం కలుగుతుందని అడిషినల్ ఎస్పీ మల్లికార్జున వర్మ పేర్కొన్నారు. మండలంలోని తరి మెల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఈశా ఫౌండేషన్ కస్టర్ పరిధిలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. బహుమతుల ప్రదాన కార్యక్రమానికి అడిషినల్ ఎస్పీ మల్లికార్జున వర్మ, అనంతపురం డీఎస్పీ వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా మల్లికార్జున వర్మ మాట్లాడుతూ యవత ప్రతిభను గుర్తించడానికి ఈ క్రీడాపోటీలు తోడ్పడుతాయన్నారు. యువత క్రీడా పోటీల్లో గెలుపు ఓటములను సమానంగా తీసుకుని ముందుకెళ్లాలని సూచించారు. పోటీ ల్లో గెలుపొందిన తరిమెల, ఆగళి, గార్లదిన్నె, ఎంఎంపల్లి జట్లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఐ శరత్ చంద్ర, సర్పంచ్ ఓబిలేసు, రవితేజ, క్రీడాకారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

గార్లదిన్నె, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్క రించుకుని ఆదివారం గార్లదిన్నెలోని గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. అలాగే పుస్తకాలను చదవడంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి శిరీష సూచించారు.

చికిత్స పొందుతూ కంప్యూటర్ టీచర్ మృతి

కనగానపల్లి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బెంగుళూరులోని ఓ ప్రైవేట్ ఆసపత్రిలో చికిత్స పొందుతున్న కంప్యూటర్ టీచర్ సురేష్ నాయుడు(33) ఆదివారం తెల్లవారు జామును మృతిచెందాడు. మండలకేంద్రమైన కనగాన పల్లికి చెందిన సురేష్‌నాయుడు స్థానిక ఆదర్శ పాఠశాలలో కంప్యూటర్ టీచర్‌గా పని చేస్తున్నాడు. దాదాపు నెల క్రితం ఆయన ముక్తాపురం జంక్షన్ వద్ద రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. అప్పటి నుంచి బెంగుళూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య శోభారాణితో పాటు ఇద్దరు పిల్లలున్నారు.

నిరుద్యోగ సమస్య పరిష్కరించాలి

● ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్‌బాబు



ఏఐవైఎఫ్ స్తూపాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్, నవంబరు17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నెలకొన్న నిరుద్యోగ సమస్యలను పరిష్కరించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్‌బాబు డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ నగర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం తపోవనం నుంచి నవయుగ కాలనీ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నవయుగ కాలనీలో ఏర్పాటు చేసిన ఏఐవైఎఫ్ స్తూపాన్ని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్‌బాబు, సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ ఆవిష్కరించారు. లెనిన్‌బాబు మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయ న్నారు. ప్రాథమిక హక్కు అయిన విద్య వ్యాపారంగా మారిందని, వైద్యం అందరికీ అందడం లేదని, చదువుకున్న నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభించడం లేదని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నిరుద్యోగ యువతకు నెలకు రూ.3వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడిచినా అది నెరవేర్చలేదన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ మాట్లాడుతూ ప్రతియేటా రెండుకోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని, నల్లధనాన్ని వెనక్కు తీసుకువచ్చి ప్రతిఒక్కరి ఖాతాల్లో రూ.15లక్షలు జమ చేస్తామని చెప్పి ప్రధాని మోదీ దేశప్రజలను మోసగించాడన్నారు. సీపీఐ నగర కార్యదర్శి శ్రీరాములు మాట్లాడుతూ... రాష్ట్రంలో మాదక ద్రవ్యాలను పూర్తిగా అరికట్టాల్సిన అవసరముందన్నారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సంతోష్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో నవయుగ కాలనీ కార్యదర్శి రాజు, ఏఐవైఎఫ్ నగర అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్, మోహన్‌కృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంటు పునఃప్రారంభం

రామగిరి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నసనకోట గ్రామంలో పరిటాల రవీంద్ర వాటర్ ప్లాంటును ఆదివారం టీడీపీ నాయకులు పునః ప్రారంభించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పట్టించుకోకపోవడంతో ఈ వాటర్ ప్లాంటు పూర్తిగా మూలనపడింది. కూటమి ప్రభుత్వం రాగానే మరమ్మతులు చేయించి పునఃప్రారంబించారు. కార్యక్రమంలో టీడీపీ సీని యర్ నాయకులు రామ్మూర్తి నాయుడు, సర్పంచ్ లలితమ్మ, వైస్‌సర్పంచ్ గంగాధర్, మాజీ సర్పంచ్ అంజనేయులు, హెచ్ ముత్యాలు, సుధాకర్, గురు, రామాంజనేయులు, దుర్గప్ప, రాము తదితరులు పాల్గొన్నారు.

కోటంకలో లక్ష దీపారాధన



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

గార్లదిన్నె, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటంక సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం రాత్రి లక్ష దీపారాధన కన్నులపండువగా జరిగింది. ప్రతి ఏడాది కార్తీక మాసంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో లక్ష దీపారాధన నిర్వహించడం ఆనవాయితీ. లక్ష దీపారాధన సందర్భంగా ఆదివారం వేకువజామునే ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం వివిధ గ్రామాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చి లక్ష దీపారాధన మహోత్సవం చేపట్టారు. ఆలయ ప్రాంగణం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి నామస్మరణతో మార్మోగింది.

క్రికెట్ పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న చైర్మన్, సీఈఓ

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక అనంత క్రీడాగ్రామం ఆర్డీటీ స్టేడియంలో ఆదివారం 71వ అఖిల భారత సహకార వారోత్సవాల సందర్భంగా అర్బన్ బ్యాంకు ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. అర్బన్ బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళీధర్ నాయకత్వంలోని జట్టు మొదట బ్యాటింగ్ చేయగా.... 15 ఓవర్లలో 7వికెట్లు కోల్పోయి 75 పరుగులు చేశారు. బ్యాంకు మేనేజర్ సతీష్ నాయకత్వంలోని స్టాఫ్ జట్టు 13 ఓవర్లలో 5 వికెట్ల నష్టపోయి లక్ష్యాన్ని ఛేదించారు. విజేతలకు చైర్మన్ జేఎల్ మురళీధర్, సీఈఓ విజయభాస్కర్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఇదే స్ఫూర్తితో సహకార అర్బన్ బ్యాంకు అభివృద్ధికి, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని చైర్మన్ తెలిపారు. అర్బన్ బ్యాంకు పాలకవర్గసభ్యులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు సేవాభావంతో పనిచేయాలి: కలెక్టర్



జ్యోతిప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ తదితరులు

అనంతపురంటౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): వైద్యరంగం ఎంతో అభివృద్ధి చెందిందని, కరువు ప్రాంతంగా పేరుగాంచిన అనంత జిల్లాలోనూ ఇపుడు ప్రజలకు అధునాతన వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. కిమ్స్‌సవేరా ఆస్పత్రుల సీఎండీ బొల్లినేని భాస్కరరావు ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాకేంద్రంలో ఊపిరితిత్తుల వ్యాధులకు సంబంధించి రాయలసీమ స్థాయి సదస్సు నిర్వహించారు. సప్తగిరిసర్కిల్‌లో ఉన్న ఓప్రముఖ హోటల్‌లోని ఆడిటోరియంలో నిర్వహించిన ఈ సదస్సుకు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ... అధునాతన వైద్యసేవలను ప్రతి డాక్టరు అందిపుచ్చుకొని రోగులకు సులభతరమైన శస్త్రచికిత్సలు అందిస్తూ వారిప్రాణాలు కాపాడాలని సూచించారు. కిమ్స్‌సవేరా ఆస్పత్రుల సీఎండీ మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు అధునాతన వైద్యసేవలు అందించాలనే కొత్త టెక్నాలజీకి సంబంధించిన వైద్యపరికరాలు ఇక్కడ అందుబాటులోకి తెచ్చామన్నారు. ఈ సదస్సుద్వారా ఊపిరి తిత్తుల వ్యాధుల గురించి వైద్యులకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఈ సదస్సులో డీఎంహెచ్ఓ డాక్టరు ఈబీ దేవి, జిల్లా ఆస్పత్రి సూపరిం టెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, డీసీహెచ్ఎస్ డాక్టరు రవికుమార్, కిమ్స్‌సవేరా ఆస్పత్రి ఎండీ డాక్టర్ కిషోర్‌రెడ్డి, ప్రముఖ పల్మనాలజిస్టులు డాక్టర్ శుభకర్, డాక్టర్ యశోవర్ధన్, డాక్టర్ రవిశంకర్‌తో పాటు ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణరాష్ట్రాలకు చెందిన పలువురు డాక్టర్లు, అనంత జిల్లా డాక్టర్లు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ జెండా ఆవిష్కరణ

శింగనమల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రంలోని కమ్యూనిటీ ఆసుపత్రి వద్ద ఆదివారం ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించారు. ఏఐటీయూసీ (మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం శ్రీనివాసులు జెండా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం నాయకులు చిన్నప్ప యాదవ్, వెంకటేశ్, మధుయాదవ్, నేసే మధు, సుధీర్, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

అనంత చిన్నారులకు బాలకళారత్న అవార్డులు



అవార్డులు అందుకున్న చిన్నారులతో పట్నం శివప్రసాద్

అనంతపురం కల్చరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి చెందిన చిన్నారులను బాలకళారత్న అవార్డులు వరించాయి. సాయి మంజీర కూచిపూడి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో గుంటూరు బృందావన గార్డెన్స్‌లోని అన్నమయ్య కళావేదికలో ఈనెల 14 నుంచి 16 వరకు నృత్య కళాపోటీలు నిర్వహించారు. మొదటిరోజు సీనియర్స్, రెండోరోజు సబ్‌జూనియర్స్, మూడోరోజున జూనియర్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. గెలుపొందినవారికి ఆదివారం అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ నేపథ్యంలో అనంతపురం నగరానికి చెందిన గురుకృప సంగీత నృత్యకళానిలయం నాట్యాచార్యుడు పట్నం శివప్రసాద్ శిష్యబృందం సీనియర్స్ విభాగంలో లాలిత్య, దేవీ చందన, సబ్ జూనియర్స్ విభాగంలో మయూఖశ్రీ, వైదూర్య, జస్వినిలు గెలుపొందగా జూనియర్స్ విభాగంలో రిషికశ్రీ, మహతి మనోజ్ఞ గెలుపొందారు. వీరికి భారతీయ విద్యాభవన్ సంస్థ అధినేత జింకా విజయ్ బాబు, తిరుపతి మస్తానయ్య, డాక్టర్ కాజా సుబ్రహ్మణ్యం, నాట్యాచార్యురా లు అచ్యుత మానస, వైష్ణవి బాలకళారత్న అవార్డులు అందజేసి సత్కరించారు.

కనకదాస జయంతికి తరలిరండి

రామగిరి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): భక్త కనకదాస జయంతి వేడుకలను విజయవంతం చేయాలని కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోరంపల్లి ఆంజనేయులు, నియోజకవర్గ అధ్యక్షుడు బిల్లే నరేంద్ర, టీడీపీ మండల కన్వీనర్ సుధాకర్ పిలుపునిచ్చారు. పేరూరులో ఆదివారం సమావేశంలో వారు మాట్లాడుతూ... అనంతపురం నగర శివారులోని కేటీఆర్ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం ఉదయం 10గంటలకు భక్త కనకదాస జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కురుబ సంఘం నాయకులు వెంకటాపురం మురళి, రెబ్బల శ్రీనివాసులు, తిమ్మారెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, రామాంజినేయులు, రమేశ్, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికకు కసరత్తు



వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో దుస్థితిలో ఉన్న రాయలచెరువు గ్రామ చెరువు

● మండలంలో రెండు సాగునీటి సంఘాలు
● 406 మంది ఓటర్లు

యాడికి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల అధ్యక్షుల ఎన్నికకు ఇటు అధికారులు, అటు నాయకులు కసరత్తు మొదలుపెట్టారు. మండలంలో రాయలచెరువు, పిన్నేపల్లి గ్రామాల్లో చెరువులు ఉన్నాయి. రాయలచెరువు పరిధిలో 322మంది, పిన్నేపల్లి చెరువు పరిధిలో 84మంది ఆయకట్టు రైతులు ఉన్నారు. 2016లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో సాగునీటి సంఘాల ఎన్నికలు జరిగాయి. చెరువుల్లో కంపచెట్ల తొలగింపు, రైతుల అవసరాలకు తగ్గట్టు పూడికమట్టితీత వంటి పనులు చేపట్టారు. రాయలచెరువు చెరువుకు నీరు విడుదల చేయడంతో అప్పట్లో పరిసర ప్రాంతాల్లో భూగర్భజలాలు పుష్కలంగా ఉండేవని పలువురు ఆయకట్టు రైతులు తెలుపుతున్నారు. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వ హయాంలో సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణ ఊసేలేదు. చెరువుల పునరుద్ధరణ పనులు చేపట్టిందీ లేదు. దీంతో ఆయకట్టు రైతులు సైతం వర్షాధార పంటలను మాత్రమే సాగుచేసుకోవాల్సి వచ్చింది. ఇప్పుడు కూటమి అధికారంలోకి వచ్చాక సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు ప్రక్రియకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఆయకట్టు రైతులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణదిశగా అధికారులు కసరత్తు మొదలు పెట్టారు. నాయకులు సైతం సాగునీటి సంఘాల ఎన్నికల్లో అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులను తమ అనుచరులకే దక్కించుకునేలా ప్రయత్నాలు ప్రారంభించారు. ఈనెల 21న సాగునీటి సంఘాల ప్రతినిధుల ఎన్నిక కోసం సమావేశాల నిర్వహణ, అదేరోజు సాగునీటి సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎంపిక చేయనున్నారు.

రాయలచెరువు ఆయకట్టు సాగునీటి సంఘం పైనే దృష్టి..

మండలంలోని రాయలచెరువు ఆయకట్టు సాగునీటి సంఘంపైన నాయకులు ప్రధాన దృష్టిసారిస్తున్నారు. అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులు ఆశిస్తున్న వారు ఇప్పటికే ఆయకట్టు ఓటర్ల వివరాలు సేకరించి వారిని ప్రసన్నం చేసుకుంటున్నట్లు సమాచారం. 322మంది ఓటర్లు ఉన్న రాయలచెరువు సాగునీటి సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులను పలువురు ఆశిస్తున్నట్లు తెలిసింది.

క్లుప్తంగా..

రేపు జాబ్‌మేళా

గుంతకల్లుటౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్కేపీ డిగ్రీ కళాశాలలో ఈనెల 19వ తేదీ మంగళవారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జవహర్ నాలెడ్జ్ సంయుక్తాధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మయ్య ఆదివారం ప్రకటనలో తెలిపారు. హెచ్‌డీఎఫ్‌సీ, మెడ్‌ప్లస్, టాటాఎలక్ట్రానిక్స్, కేఎల్‌గ్రూప్స్, బిగ్‌బాస్కెట్, డైకిన్‌ఏసీ, ఐఎఫ్ఎల్, క్రెడిట్ అసెస్‌గ్రామీణ, జారీ క్రాట్, హెల్త్‌కెర్‌తో పాటు పలు కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. నిరుద్యోగ యువత తమ బయోడేటాతో పాటు ఆధార్, విద్యార్హత సర్టిఫికెట్లతో ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు.

కోడలిపై అత్త దాడి

గుత్తిరూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాచుపల్లి గ్రామంలో గల జంగాల కాలనీలో ఆదివారం అత్త దాడి చేయడంతో కోడలికి గాయాలయ్యాయి. కాలనీకి చెందిన వెంకటేష్ తల్లి లక్ష్మీదేవికి, భార్య నందినికి కుటుంబ సమస్యలతో చిన్నపాటి ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో లక్ష్మీదేవి ఆగ్రహానికి గురై కోడలిపై కర్రతో దాడి చేసింది. దీంతో నందినికి గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తర్వాత మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

యాడికి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఇసుకను అక్రమ రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను ఆదివారం సీజ్‌చేసినట్లు సీఐ ఈరన్న తెలిపారు. పెద్దపప్పూరు మండలం నుంచి యాడికి మండలానికి ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం అందిందని, దీంతో వెంటనే దాడిచేసి యాడికిలో మూడు ట్రాక్టర్లను సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించామని సీఐ పేర్కొన్నారు. దాడుల్లో సిబ్బంది పాల్గొన్నారు.

8 నాపరాళ్ల ట్రాక్టర్లు..

తాడిపత్రి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని సజ్జలదిన్నె గ్రామ సమీపంలో ఆదివారం అధిక లోడు, అధిక వేగంతో వెళుతున్న 8నాపరాళ్ల ట్రాక్టర్లను సీజ్ చేశామని రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. ఈ మధ్యకాలంలో ట్రాక్టర్లు అధికలోడు వేసుకుని అధిక స్పీడుతో వెళుతుండడం వల్ల ప్రమాదాలకు కారణమవుతున్నాయన్నారు. వీటిని అరికట్టేందుకు ప్రత్యేక చొరవ తీసుకొని వాటి డ్రైవర్లకు సలహాలు, సూచనలు ఇస్తున్నట్లు చెప్పారు. అధికలోడు ట్రాక్టర్లను సీజ్‌చేసి జరిమానాలు విధిస్తున్నామన్నారు. శనివారం పట్టణంలో జరిగిన రోడ్డు ప్రమాదానికి నాపరాళ్ల ట్రాక్టరే కారణమని ఆయన పేర్కొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



రామాంజనేయులు (ఫైల్)

కళ్యాణదుర్గంరూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన చాకలి రామాంజనేయులు గత రెండు రోజుల నుంచి కనిపించడం లేదు. దీంతో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. చాకలి రామాంజనేయులు పోస్ట్‌మెన్‌గా విధులు నిర్వహించేవారు. కాగా శనివారం ఉదయం విధులకు వెళ్లిన అతను తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబసభ్యులు పలుచోట్ల గాలించినా ఆచూకీ తెలియలేదు. దీంతో కుమారుడు మహేష్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడని, ఆ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

హైందవ శంఖారావాన్ని విజయవంతం చేయండి

యాడికి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): విజయవాడలో వచ్చే ఏడాది జనవరి 5వ తేదీన హైందవ శంఖారావ బహిరంగ సభ జరగనుందని, హిందూ సోదరులంతా పాల్గొని విజయవంతం చేయాలని బీజేపీ తాడిపత్రి నియోజకవర్గ కో కన్వీనర్ గంగాధర్ పిలుపునిచ్చారు. హైందవ శంఖారావ బహిరంగ సభ కు సంబంధించిన కరపత్రాలను ఆదివారం ఆయన యాడికిలోని చెన్నకేశవస్వామి ఆలయ ప్రాంగణంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హిందూ దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కోసం, సమాజ సంరక్షణ కోసం హైందవ శంఖారావ సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. హైందవులంతా శంఖారావం సభలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో రఘువీరాచారి, హరిస్వామి, రాజశేఖర్, శివారెడ్డి, జనార్దన, రామకృష్ణ, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

రాత్రి పూటే అన్‌లోడ్ చేయాలి

గుంతకల్లు టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో హోల్‌సేల్ వ్యాపారులు రాత్రి పూట మాత్రమే నిత్యావసర సరుకులను అన్‌లోడ్ చేసుకోవాలని వన్‌టౌన్ సీఐ మనోహర్ సూచించారు. స్థానిక వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం సాయంత్రం ఆయన హోల్‌సెల్ మర్చెంట్ అసోసియేషన్ సభ్యులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పగటి పూట దుకాణాల ఎదుట వాహనాలను నిలిపి సరుకులను అన్‌లోడ్ చేస్తుండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందన్నారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కనుక నిత్యావసర సరుకులను అన్‌లోడ్, లోడ్ ను రాత్రి సమయంలో చేసుకోవాలని తెలిపారు. వ్యాపారులు షాపుల వద్ద తప్పని సరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని అసోసియేషన్ సభ్యులకు సీఐ తెలిపారు.

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

రాయదుర్గంరూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విద్యార్థి సంఘం నాయకుల అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేదని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బంగి శివ పేర్కొన్నారు. చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్తారనే సమాచారం అందడంతో ఆదివారం తెల్లవారుజామున పోలీసులు ముందస్తుగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బంగి శివ, పట్టణ అధ్యక్షుడు వలీ ఇంటి వద్దకు వెళ్లి వారిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం మధ్యాహ్నం సొంతపూచీకత్తుపై విడుదల చేశారు. దీంతో బంగిశివ మాట్లాడుతూ విద్యార్థి సమస్యలను పరిష్కరించాలంటూ 18వ తేదీన చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహించడంతో ప్రభుత్వం ఓర్వలేకే అరెస్టులు చేయించిందని తెలిపారు. అరెస్టులకు భయపడేదేలేదని, విద్యార్థి సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తామని పేర్కొన్నారు.

కడ్లే గౌరమ్మకు హారతుల మహోత్సవం



కణేకల్లు మండలం హనకనహాళ్‌లో హారతులతో మహిళల ఊరేగింపు

విడపనకల్లు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కడ్లే గౌరమ్మ పూల రథోత్సవ వేడుకల్లో భాగంగా మూడో రోజైన ఆదివారం అమ్మవారికి హారతులమహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 8 గంటలకు అర్చకులు కడ్లే గౌరమ్మ సభా భవనంలో మృత్యుంజయ హోమం నిర్వహించారు. 9 గంటలకు భక్తుల చేత అర్చనలు చేయించారు. సాయంత్రం మహిళలు, యువతులు మహా మంగళ హారతులు పట్టి పూజలు నిర్వహించారు. ఆలయకమిటీ పెద్దలు పాల్గొన్నారు.

కణేకల్లు: మండలవ్యాప్తంగా గౌరమ్మ పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మహిళలు గౌరీదేవతకు చక్కెర చదివింపులు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గ్రామపెద్దలు, భక్తులు ఉత్సవ విగ్రహాలను ఊరేగింపు చేసి సమీప బావుల్లో, చెరువుల్లో నిమజ్జనం చేశారు. ఊరేగింపులో మహిళలు కలశాలు, హారతులతో పాల్గొన్నారు. కణేకల్లు, మాల్యం, ఉడేగోళం, బ్రహ్మసముద్రం, బెణెకల్లు, యర్రగుంట, హనకనహాళ్ గ్రామాల్లో వేడుకలు ఘనంగా జరిగాయి.

బొమ్మనహాళ్: మండలంలోని ఉంతకల్లు, ఉద్దేహాళ్, శ్రీధరఘట్ట గ్రామాల్లో గజగౌరీ, కడ్లేగౌరమ్మ ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. వేకువజామున ప్రత్యేక వాహనాల్లో గజగౌరీ, కడ్లేగౌరమ్మల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. తర్వాత వేదావతి హగరి, హెచ్చెల్సీలో పూజలు నిర్వహించి నిమ్మజ్జనం చేశారు. యువతులు, మహిళలు భక్తి శ్రద్ధలతో కలశాలతో పాల్గొన్నారు.

రాయదుర్గంరూరల్: మండలంలోని కొండాపురంలో గజగౌరీ ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గౌరమ్మ పండుగ సందర్భంగా అమ్మవారికి మూడురోజుల పాటు ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం అమ్మవారి ప్రతిమను ప్రత్యేకంగా అలంకరించి ఊరేగింపు చేశారు. అనంతరం గ్రామ సమీపంలోని బావిలో నిమజ్జనం చేశారు.

ఉత్సాహంగా రాతిదూలం లాగుడు పోటీలు

బొమ్మనహాళ్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో గజగౌరి వేడుకలను పురస్కరించుకుని ఆదివారం రాతిదూలం లాగుడు పోటీలను ఉత్సాహంగా నిర్వహించారు. సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి మల్లికార్జున, టీడీపీ నాయకులు నవీన్, సంగప్ప, సైకిల్ షాప్ హనుమంతు, దుర్గాప్రసాద్ ఈ పోటీలను ప్రారంభించారు. తొమ్మిది జతలు వృషభాలు పాల్గొన్నాయి. అందులో ఆత్మకూరు మండలం తోపుదుర్తి గ్రామానికి చెందిన రెండు జతల వృషభాలు ప్రథమ, తృతీయ స్థానాల్లో నిలవగా.. రెండో స్థానంలో కర్ణాటకలోని ఆంధ్రాళ్‌కు చెందిన ఆనంద్‌రెడ్డి వృషభాలు, మూడో స్థానంలో బొమ్మనహాళ్ మండలం ఉద్దేహాళ్‌కు చెందిన బసన్న వృషభాలు, ఐదో స్థానంలో ఉరవకొండ పట్టణానికి చెందిన విశాల్ వృషభాలు నిలిచాయి. విజేత వృషభాల యజమానులకు వరుసగా రూ.25వేలు, రూ.20, వేలు, రూ. 15 వేలు, రూ. 10 వేలు, రూ.5వేలు చొప్పున గజగౌరీ కమిటీ సభ్యులు అందజేశారు. పోటీలను తిలకించడానికి వివిధ గ్రామాల నుంచి పెద్దఎత్తున తరలి వచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోటేశ్వరరెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన

యాడికి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో ఆదివారం మే ఐ హెల్ప్‌యూ ఫౌండేషన్, వేడుకాపుర ఫౌండేషన్, మాతృశ్రీ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. స్థానిక వివేకానంద హైస్కూల్‌లో నిర్వహించిన వైద్యశిబిరానికి 103మంది వచ్చి వైద్యపరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో మాతృశ్రీ హాస్పిటల్ వైద్యులు, యాడికి మే ఐ హెల్ప్‌యూ ఫౌండేషన్, వేడుకాపుర ఫౌండేషన్ సభ్యులు బాలకృష్ణ, చంద్రశేఖర్‌రెడ్డి, నరసింహ, వేణు, శంకరప్ప, శ్రీనివాసులు, రాంమోహన్, పుల్లయ్య, నరేష్ యాదవ్, మహేంద్ర పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి గ్రామోత్సవం

యల్లనూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం అయ్యప్పస్వామి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గురుస్వామి ఆనంద్‌స్వామి ఆధ్వర్యంలో మాలధారులు స్థానిక నరసింహస్వామి ఆలయం వద్ద అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి చిత్రపటాన్ని ఊరేగిస్తూ గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు కాయ కర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

రెండు పాఠశాలల్లో ఆధార్ కేంద్రాలు

పుట్లూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఆదర్శపాఠశాల, కడవకల్లు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నుంచి 23వతేదీ వరకు ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీఓ కార్యాలయ వర్గాలు ఆదివారం తెలిపాయి. విద్యార్థుల అపార్‌కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆధార్‌కార్డులో మార్పులు, చేర్పులు చేస్తామన్నారు. అవకాశాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైద్యులు సేవాభావంతో పనిచేయాలి : కలెక్టర్

అనంతపురం టౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): వైద్యరంగం ఎంతో అభివృద్ధి చెందిందని, అనంత జిల్లాలోనూ ఇపుడు ప్రజలకు అధునాతన వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. కిమ్స్‌సవేరా ఆస్పత్రి సీఎండీ బొల్లినేని భాస్కరరావు ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాకేంద్రంలో ఊపరితిత్తుల వ్యాధులకు సంబంధించి రాయలసీమ స్థాయి సదస్సు నిర్వహించారు. సప్తగిరిసర్కిల్‌లో ఉన్న ఓప్రముఖ హోటల్‌లోని ఆడిటోరియంలో నిర్వహించిన ఈ సదస్సుకు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అధునాతన వైద్యసేవలను ప్రతి డాక్టరు అందిపుచ్చుకొని రోగులకు సులభతరమైన శస్త్రచికిత్సలు అందిస్తూ వారిప్రాణాలు కాపాడాలని సూచించారు. కిమ్స్‌సవేరా ఆస్పత్రుల సీఎండీ మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు అధునాతన వైద్యసేవలు అందించాలనే కొత్త టెక్నాలజీకి సంబంధించిన వైద్యపరికరాలు ఇక్కడ అందుబాటులోకి తెచ్చామన్నారు. సదస్సులో డీఎంహెచ్ఓ ఈబీదేవి, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, డీసీహెచ్ఎస్ డాక్టరు రవికుమార్, కిమ్స్‌సవేరా ఆస్పత్రి ఎండీ కిషోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నారా రామ్మూర్తి నాయుడి మృతికి సంతాపం





గుత్తిలో చిత్రపటం వద్ద అంజలి ఘటిస్తున్న టీడీపీ నాయకులు, రాయదుర్గంలో..

కళ్యాణదుర్గం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు సోదరుడు, మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడి మృతికి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆదివారం ప్రకటనలో సంతాపం తెలిపారు. రామ్మూర్తినాయుడు అకాల మరణం బాధాకరమన్నారు. ఎమ్మెల్యేగా చంద్రగిరి నియోజకవర్గ అభివృద్ధికి ఆయన చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నట్లు ప్రకటించారు.

గుంతకల్లు: నారా రామ్మూర్తినాయుడి మృతికి పట్టణంలోని టీడీపీ నాయకులు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో నాయకుడు గుమ్మనూరు నారాయణస్వామి ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్, నాయకులు ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, తలారి మస్తానప్ప, పాల మల్లికార్జున, ఉడదాల ప్రభాకర్, శివన్న, అంజి, రాయల్ వెంకటేశ్, ఫజులు, గౌసియా పాల్గొన్నారు.

గుత్తి: నారా రామ్మూర్తినాయుడు మృతికి పట్టణంలోని టీడీపీ నాయకులు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లాలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు గుమ్మనూరు ఈశ్వర్, గుమ్మనూరు నారాయణ, పట్టణ అధ్యక్షుడు ఎంకే చౌదరి తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గంరూరల్: పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు నారా రామ్మూర్తి నాయుడి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ పసుపులేటి నాగరాజు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ మహబూబ్‌బాషా, నాయకులు శంకర్, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

రాయదుర్గంరూరల్, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. ఇందులో ఆ కళాశాలలో 1995 నుంచి 2000వ విద్యాసంవత్సరాల్లో ఇంటర్ చదివిన విద్యార్థులు , కేటీఎస్ డిగ్రీ కళాశాలలో బీఏ చదివిన విద్యార్థులు కలిశారు. చాలా ఏళ్ల తర్వాత అందరూ కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని, నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం నాటి అధ్యాపకులను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. అందరూ సాయంత్రం దాకా కళాశాలలో సరదాగా గడిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

తాడిపత్రి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని సజ్జలదిన్నె గ్రామసమీపంలో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్ట్‌చేసి వారివద్ద నుంచి రూ.22వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో వెంటనే ఎస్ఐ ధరణీబాబు సిబ్బందితో కలిసి దాడులు చేశారని, అందులో పేకాటరాయుళ్లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారని పేర్కొన్నారు.

వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శం: ఎంపీ



విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

ఉరవకొండ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి మహర్షి జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శ ప్రాయమని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. వజ్రకరూరు మండలం పందికుంట గ్రామంలో ఆదివారం వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. ఇందులో ఎంపీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాల్మీకి విగ్రహానికి పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. వేటగాడిగా ఉన్న వాల్మీకి రామాయణాన్ని రచించి మహర్షిగా పరిణితి చెందారని, ఆయన జీవితాన్ని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. టీడీపీ మండల కన్వీనర్ నూతేటి వెంకటేశులు, నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి, మాజీ ఎంపీపీ ప్రతాప్‌నాయుడు, మార్కెట్‌యార్డు మాజీ చెర్మన్లు రేగాటి నాగరాజు, బీసీ మారెన్న తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మూడు సెంట్ల స్థలం ఇవ్వాలి

కూడేరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం పేదలకు మూడు సెంట్లు స్థలం కేటాయించి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఐ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో ఆదివారం వారు పలు కాలనీలో పర్యటించి ఇళ్లు లేని నిరుపేదలను గుర్తించారు. అనంతరం మాట్లాడుతూ తక్షణం ఈ నిరుపేదల అర్జీలు స్వీకరించి, వారికి స్థలం కేటాయించి, ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. ఈ మేరకు సోమవారం సచివాలయాల ఎదుట నిరసనలు తెలుపుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకుడు కేశవరెడ్డి పాల్గొన్నారు.

ఎక్సైజ్ కార్యాలయం తనిఖీ



సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్

తాడిపత్రి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయాన్ని ఆ శాఖ డిప్యూటీ కమిషనర్ మునిస్వామి ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ ఎక్కడైనా బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం స్థానిక కల్లుదుకాణాన్ని తనిఖీ చేసి శ్యాంపిల్స్‌ను తీసుకున్నారు. ఆయన వెంట ఎక్సైజ్ సీఐ నాయుడు, ఎస్ఐ ఆంజనేయులు, సిబ్బంది ఉన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న కాలవ భరత్

రాయదుర్గంరూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీఆర్ అంబేడ్కర్ నగర్‌లో పురాతన మైలార లింగస్వామి ఆలయ పునర్నిర్మాణానికి ఆదివారం భూమిపూజ నిర్వహించారు. అర్చకులు వేదమంత్రోచ్చారణలతో భూమిపూజ చేశారు. ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్ పాల్గొన్నారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ లక్షలాది రూపాయల సొంత నిధులతో ఆలయ పునర్నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. దాతలు, భక్తులు సహాయ సహకారాలు అందించాలని కోరారు. కమిటీ సభ్యుడు ఆనంద్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పసుపులేటి రాజు, నాయకులు బంగి శంకర్, సిమెంట్ శీన, మల్లి, మల్లక్క, వైసీపీ కౌన్సిలర్లు వన్నూరుస్వామి, శారదమ్మ పాల్గొన్నారు.

117 జీవోను రద్దు చేయాలి: యూటీఎఫ్



ర్యాలీలో పాల్గొన్న యూటీఎఫ్ నాయకులు

ఉరవకొండ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జీవో నెంబర్-117ను రద్దు చేసి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప పేర్కొన్నారు. పట్టణంలో ఆదివారం ఆయన యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభ పోస్టర్లను నాయకులతో కలిసి విడుదల చేశారు. అలాగే యూటీఎఫ్ స్వర్ణోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్-117 వల్ల పాఠశాలలను విలీనం చేయడంతో లక్షలాది మంది విద్యార్థులు పాఠశాలలో చేరడం తగ్గిపోయారన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం జీవో నెంబర్-117ను రద్దు చేసి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు గోవిందప్ప, రామప్ప చౌదరి, శేఖర్ పాల్గొన్నారు.

యూటీఎఫ్ కమిటీల ఏర్పాటు

యూటీఎఫ్ ఉరవకొండ, వజ్రకరూరు, విడపనకల్లు మండలాల నూతన కమిటీలను ఎన్నుకున్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా శ్రీనివాసులు, జయరాములు, మురళి, రఘు, లక్ష్మీనారాయణతో పాటు మరికొందమందిని కమిటీల్లో ఎన్నుకున్నారు.

సుబ్బరాయసాగర్‌లోకి హెచ్చెల్సీ నీరు



డ్యాంలోకి చేరుతున్న నీరు

పుట్లూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంజీవపురం వద్ద ఉన్న సుబ్బరాయసాగర్ డ్యాంలోకి హెచ్చెల్సీ నీరు చేరుతోంది. డ్యాంలోకి ఆదివారం 5.3 మీటర్ల ఎత్తు మేర నీరు వచ్చింది. మరో ఐదురోజుల్లో దిగువకు విడుదల చేయనున్నట్లు తెలిసింది. పుట్లూరు, కోమటికుంట్ల, గరుగుచింతలపల్లి చెరువులకు విడుదల చేయనున్నట్లు సమాచారం.

కమ్మేసిన పొగమంచు..



జాతీయ రహదారిపై కమ్ముకున్న పొగమంచు

ఉరవకొండ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పొగమంచు ఆదివారం ఉరవకొండ పట్టణాన్ని కమ్మేసింది. ఉదయం 8 గంటల వరకూ దట్టంగా కమ్ముకోవడంతో ఎదుట ఏదీ కనిపించని పరిస్థితి నెలకొంది. దీంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. రోడ్లపై వాహనాలకు లైట్లు వేసుకుని మరీ ముందుకెళ్లారు.

వర్షాలకు కూలిన కేజీబీవీ ప్రహరీ



కూలిన పాఠశాల ప్రహరీ

బ్రహ్మసముద్రం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గత మూడు రోజులుగా కు రుస్తున్న వర్షాలకు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల ప్రహరీ గోడ సుమారు వంద మీటర్ల మేర కూలిపోయింది. అసలే ప్రహరీ ఎత్తులేక బాలికలు, సిబ్బంది బాధపడుతున్నారు. ఇప్పుడేమో ఉన్న ఆ గోడ కాస్తా కూలిపోయింది. దీంతో పాఠశాలలోకి పురుగు పుట్ర జొరబడతాయేమోనని విద్యార్థినులు, ఉపాధ్యాయ సిబ్బంది బిక్కు బిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. అధికారులు స్పందించి త్వరగా ప్రహరీ నిర్మించి విద్యార్థినులకు భరోసా కల్పించాలని తల్లిదండ్రులు, గ్రామస్థులు కోరుతున్నారు.